క్లుప్తంగా

ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి



ఓటరు జాబితా పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

కౌటాల: ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఓటర్ జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో తప్పులు లేకుండా చూడాలన్నారు. ఓటర్‌కు రెండు చోట్ల ఓటు ఉంటే ఒకటి తొలగించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తహసీల్దార్ సాయన్న తదితరులు ఉన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న తుకారం, వేణు

కెరమెరి: బీజేపీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సెడ్మకి తుకారాం, బీజేవైఎం మండల అధ్యక్షుడు ఎస్.వేణు పేర్కొన్నారు. మండలంలోని బారేమోడి, సుర్దాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన స్వశక్తి అభియాన్ కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. స్వశక్తి సభ్యులు గ్రామాల్లో కేంద్రం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలపై గ్రామీణులకు అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సోము, గాగ్రు, లక్ష్మణ్, సాగర్, భీంరావు, శ్యాంరావు, మనోజ్, సాయిరాం పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ నరసింహస్వామి

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి కోరారు. కౌటాల టీజీబీ ఆధ్వర్యంలో మండలంలోని తాటిపల్లి, నాగేపల్లి గ్రామాల్లో ప్రజలకు శుక్రవారం బీమా పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన గురించి వివరించారు. సర్పంచ్ సోయం సురేష్, బ్యాంకు అధికారులు రాజేశ్, మోరేశ్వర్, పండిత్, నాయకులు జ్యోతిరావు, నాందేవ్, శారద, సుమన్‌బాయి తదితరులు పాల్గొన్నారు.

సరుకుల పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన సడ్మెక రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం సర్పంచ్ దుర్గం రాజన్న, మండల కోఆప్షన్ సభ్యుడు సాజీద్ 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. రాజన్న, సిడెం అశోక్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలి

రెబ్బెన: గంగాపూర్ బాలాజీ వేంకటేశ్వరస్వామి అన్నదాన సొసైటీ ప్రథమ వార్షికోత్సవాన్ని భక్తులు విజయవంతం చేయాలని సొసైటీ అధ్యక్షుడు మొగులూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోలెం తిరుపతి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. మే 4న ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో వేంకటేశ్వర స్వామి 7 అడుగుల ప్రతిమ ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

10న విగ్రహ ప్రతిష్ఠాపన

నార్నూర్: మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని మే 10న నిర్వహించనున్నట్లు దీక్ష గురువు ప్రేంసింగ్ మహరాజ్ తెలిపారు. శుక్రవారం ఆయన విగ్రహప్రతిష్ఠాపన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొనాలని కోరారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, ఉప సర్పంచ్ చౌహాన్ మహేందర్, దత్త రాథోడ్, బాల మోహన్ పాల్గొన్నారు.

ఆముదం సాగేది?

- ఆసక్తి చూపని రైతులు
- పలుచోట్ల ఆముదం మొక్కలు
- పూజలకు ఈ నూనె వాడకం



ఆముదం విత్తనాలు



ముర్కిలొంకలో రైతు పొలంలోని ఆముదం మొక్క

ఆరోగ్యానికి ఎంతో మేలు



చిన్నతనంలో ప్రతి రోజు ఆరోగ్య సమస్యకు ఆముదాన్ని ఆయుర్వేదంగా వాడేవారు. నేడు కాస్మొటిక్ ప్రభావంతో ఆముదం వాడకం మానేశారు. శరీర సౌందర్యకు, జీర్ణప్రకియకు ఇది ఎంతో ఉపయోగపడే సాగును రైతులు మరిచిపోతున్నారు.

– ధర్మారావు, రైతు చౌపన్‌గూడ

మార్కెట్లో ధరలు లేదు



గతంలో ఆదివాసీలు సంప్రదాయ పంటగా ప్రతిఒక్కరూ ఆముదం మొక్కలు నాటేవారు. ఇప్పుడు ఆముదం మొక్కలు అక్కడక్కడ మాత్రమే కనిపిస్తున్నాయి. అందుకు వాటిని లెక్కల్లోకి తీసుకోవడం లేదు. మార్కెట్లో అమ్ముదామన్నా అనుకున్న ధర లేదు.

– ఎస్.గోపికాంత్, ఏవో, కెరమెరి

కెరమెరి: పూర్వం ప్రకృతి వైద్యంలో కీలకమైన ఆముదం నేటి వ్యవసాయ సాగులో మచ్చుకైన కనిపించడం లేదు. ఈ సాగుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గతంలో పుట్టిన పిల్లల నుంచి వయో వృద్ధుల వరకు ఆముదం తలకు రాసుకుంటే చల్లదనంతోపాటు ఆరోగ్యంగా ఉండేవారు. గతంలో దీన్ని అనేక మంది ఉపయోగించేవారు. ఆముదంతో మలబద్దకం తొలగిపోవడంతో పాటు జీర్ణప్రక్రియ సజావుగా సాగేది. నేటి వ్యవసాయ రంగంలో మండలంలో పత్తి, కంది, పెసర, జొన్న, మొక్కజొన్న తదితర పంటలపై ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మండలంలో ఎక్కడ కూడ ఆముదం సాగు చేయడం లేదు.

గతంలో ఆముదానికే ప్రాధాన్యం

కెరమెరి మండలంలోని అనేక కుటుంబాలు గిరిజనలకే చెందినవి కావడంతో గతంలో అనేక మంది అంతర పంటగా ఆముదం వేసేవారు. అప్పుడు అన్ని రకాల నూనెల కంటే ఆముదం ధర ఎక్కువ. ప్రస్తుతం మార్కెట్లో కాస్మొటిక్ ధరలు పెరగడంతో ఆముదంపై ఆదరణ తగ్గింది. మండలంలోని జోడేఘాట్ పరిసర ప్రాంతాలతో పాటు పార్డ, ముర్కిలొంక, పాట్నాపూర్, పాటాగూడ, లైన్‌పటార్, కల్లెగాం తదితర గ్రామాల సమీపం ఉన్న పొలాల్లో అక్కడక్కడ ఆముదం మొక్కలు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ 5 నుంచి 8 అడుగుల వరకు చెట్టు ఏపుగా పెరిగి కనిపిస్తున్నాయి. ఒక్కో చెట్టుకు అనేక సంఖ్యలో కాయలు కాస్తాయి. ఇప్పటికి ఆదివాసీలు దేవతల పూజలకు ఆముదం నూనె వాడుతున్నారు. మండలంలోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయి, ఇందాపూర్ సమీపంలోని పోతురాజు, ధర్మరాజుతో పాటు పెద్ద దేవుళ్లకు, పోచమ్మ తల్లికి పెట్టే దీపంలో ఆముదం నూనె వాడుతున్నారు. మండలంలోని మొత్తం 6430 మంది రైతులు ఉండగా 32 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. అందులో 24 వేల ఎకరాల్లో పత్తి ఉంది. అందులో ఈసారి పత్తి పంట మొలకెత్తని చోట అక్కడక్కడ కలిపి ఐదెకరాలకు మించి ఆముదం మొక్కలు లేవు. కాగా, అందరూ వాణిజ్య పంటల వైపే మొగ్గు చూపడంతో ఆముదం పంటకు ఆదరణ తగ్గింది.

కూలి చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న కూలీలు

రెబ్బెన: మండలంలోని కిష్టాపూర్‌లో శుక్రవారం ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. అనంతరం ఈజీఎస్ సిబ్బందిని నిలదీశారు. ఈ సందర్భంగా కూలీలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన 50 మంది గతేడాది పనిచేసిన 27 రోజులకు సంబంధించి డబ్బులు ఇప్పటివరకు అందలేదన్నారు. కార్యాలయం చుట్టూ తిరిగిన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొందరికి డబ్బులే రావని ఈజీఎస్ సిబ్బంది దబాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు చేసిన పనికి సంబంధించిన కొలతల్లో సిబ్బంది అవకతవకలకు పాల్పడి కూలీల కడుపుకొట్టారన్నారు. తక్కువ కొలతల కారణంగా చాలామందికి తక్కువ మొత్తంలో డబ్బులు పడ్డాయన్నారు. ఈజీఎస్ సిబ్బంది తమకు అన్యాయం చేస్తున్నారని అన్నారు.

5న ఆంజనేయస్వామి విగ్రహావిష్కరణ

సిర్పూర్(టి): మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మే 5న అభయ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు కారం హన్మంతు తెలిపారు. 3న శోభాయాత్ర, 4న ప్రత్యేక పూజలు, 5న ఉదయం 7:11 గంటలకు యంత్ర ప్రతిష్ఠ, విగ్రహావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. మూడు రోజులపాటు ఆలయ ప్రాంగణంలో భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



దహెగాంలో చిత్తడిగా మారిన రోడ్డు

చినుకుపడితే చిత్తడే

దహెగాం: మండల కేంద్రం నుంచి కల్వాడ వైపు వెళ్లేదారి శుక్రవారం కురిసిన వర్షానికి రహదారి చిత్తడిగా మారింది. రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైన స్పందించి సీసీ రోడ్లు వేయాలని వారు కోరుతున్నారు.

భిక్షాటన చేసి వీవోఏల నిరసన



ఆసిఫాబాద్‌అర్బన్: నిరసన తెలుపుతున్న వీవోఏలు

ఆసిఫాబాద్‌అర్బన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ సమ్మె శుక్రవారానికి 12వ రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలో కిరాణా దుకాణాలు, హోటళ్లు, ఇతర వ్యాపార సముదాయాల్లో వీవోఏలు భిక్షాటన చేసి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ వీవోఏలకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. నాయకులు జ్యోతి, రమ, ప్రమోద్, సంజీవ్, సరిత, స్వప్న, ప్రియ, కవిత తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి(జైనూర్): జైనూర్ మండలంలో వీవోఏలు భిక్షాటన చేసి వినూత్న నిరసన తెలిపారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, బ్యాంకుల్లో భిక్షాటన నిరసన వ్యక్తం చేశారు.

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలో వీవోఏలు సమ్మెకు తెలంగాణ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు మద్దతు పలికారు. సంఘం అధ్యక్షుడు ఎం.జయదేవ్ అబ్రహం, తదితరులు ఉన్నారు.

కౌటాల: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయం ఎదుట వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 12వ రోజు చేరింది. మండల కేంద్రంలోని దుకాణాల్లో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్ములే దత్తు, మండల అధ్యక్షుడు ఎ.వెంకటేశ్, వీవోఏలు రవి, కొండయ్య, ఆనంద్, భీంరావ్, మహేశ్వరి, పద్మ, ఇందిర పాల్గొన్నారు.



కౌటాల: భిక్షాటన చేస్తున్న వీవోఏలు



భిక్షాటన చేస్తున్న జైనూర్ వీవోఏలు



కాగజ్‌నగర్‌టౌన్: మద్దతు తెలుపుతున్న విశ్రాంత ఉద్యోగులు

అందని వైద్యసేవలు

- అందుబాటులో లేని సిబ్బంది
- వైద్యం అందక రోగుల ఇక్కట్లు
- ప్రైవేట్ ఆస్పత్రి ఆశ్రయిస్తున్న వైనం



మూసి ఉన్న హుడ్కిలి పీహెచ్‌సీ



తాళం వేసి ఉన్న చింతకుంట ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

వైద్యసేవలందించాలి



పల్లె దవాఖానాల్లో వైద్యసిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి. సిబ్బంది లేకనే ఆర్ఎంపీ, ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తుంది. వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి.

– ఎస్. మహేష్, స్థానికుడు

ఇబ్బంది పడుతున్నాం



పల్లె దవాఖానాల్లో వైద్యం అందక తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. వర్షాకాలంలో అనారోగ్యం పాలైతే మండలకేంద్రం లేదా, కాగజ్‌నగర్ పట్టణానికి ప్రైవేటు వాహనాల్లో వెళ్లాల్సి వస్తుంది. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది వైద్యసేవలందేలా చర్యలు తీసుకోవాలి.

– బి.వినోద్, స్థానికుడు

సిర్పూర్(టి): గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలుగా ఏర్పాటు చేసింది. ప్రతిరోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టింది. గతంలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం, ఆశవర్కర్లు కాకుండా ప్రత్యేకంగా మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించింది. వీరితో రోగులకు వైద్యసేవలందాలి. కాని గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేక రోగులు, నిరుపేద ప్రజలు ఆర్ఎంపీ, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నారు. అక్కడ చికిత్స పొందుతూ వారు ఆర్థికంగా నష్టపోతున్నారు.

మండలంలో..

మండలంలో చింతకుంట, హుడ్కిలి, లక్ష్మీపూర్ గ్రామాల్లో పీహెచ్‌సీలు (పల్లె దవాఖానాలు) ఉండగా లోనవెల్లిలో పీహెచ్‌సీ ఉంది. వీటి పరిధిలో మండలంలోని 16 పంచాయతీలు ఉండగా వీటి పరిధిలోని గ్రామాలున్నాయి. లోనవెల్లి పీహెచ్‌సీ ద్వారా గ్రామాల్లో వైద్యసిబ్బంది పర్యటించి రోగులకు అవసరమయ్యే మందులు పంపిణీ చేయాల్సి ఉంది. సిబ్బంది అడపాదడపా వస్తుండటమే తప్ప వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం, మందుల పంపిణీ చేయడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి దూరప్రాంతాల్లో ఉన్న గ్రామాల ప్రజలు జ్వరాలు, ఇతర రోగాల బారిన పడితే ఉపకేంద్రాలు, ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి వెళ్తే వైద్యసిబ్బంది అందుబాటులో ఉండడం లేదు. మరికొన్ని చోట్ల పీహెచ్‌సీలకు తాళం వేసి ఉంటున్నాయి. దీంతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి చికిత్స తీసుకుంటున్నామని రోగులు చెబుతున్నారు. ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

వరి కోతలు ఆలస్యం

దహెగాంలో వర్షాలకు నేలకొరిగిన వరి



దహెగాం: మండల కేంద్రంతోపాటు ఒడ్డుగూడ, గెర్రె, గిరవెల్లి, చినరాస్పెల్లి, బామానగర్, కల్వాడ గ్రామాల్లో యాసంగిలో రైతులు వరి సాగు చేస్తున్నారు. గత నాలుగు రోజుల క్రితం ఒడ్డుగూడ, గెర్రె, గిరవెల్లి, చినరాస్పెల్లి, కర్జి గ్రామాల్లో వడగళ్ల వర్షంతో కోతకు వచ్చిన వరి నేలరాలడంతోపాటు, వడ్ల గింజలు రాలిపోయాయి. ఉన్న వరిని కోద్దామనుకుంటే ఓ వైపు వర్షం..కోస్తే హార్వెస్టర్ ఖర్చు వస్తదో రాదోనని రైతులు ఆందోళనలో ఉన్నారు. శుక్రవారం తెల్లవారుజాము మోస్తరు వర్షంతో వరి పొలాల్లో భూమి పచ్చిగా ఉంది. హార్వెస్టర్ నడవని పరిస్థితి. కోతలు ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి.

భరోసా సభకు తరలిరావాలి

కౌటాల(సిర్పూర్): హైదరాబాద్‌లో ఈ నెల 7న బీఎస్పీ నిర్వహించే తెలంగాణ భరోసా సభకు ప్రజలు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మోర్లె గణేశ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఆరె సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనులకు రాజ్యాధికారం వచ్చినప్పుడే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జిల్లాలో బీఎస్పీ బలోపేతం కృషి చేయాలన్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించే తెలంగాణ భరోసా సభకు జాతీయ అధ్యక్షులు మాయవతి హాజరవుతున్నారని తెలిపారు. జిల్లా నుంచి బహుజనులు, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కొండ రాంప్రసాద్, నాయకులు రాంటెంకి నవీన్, సంజీవ్, భరత్, మోతీరాం, రజనీకాంత్, దిలీప్ పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: అర్హులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేస్తామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్‌లో వార్డు ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో విలీనమైన వార్డుల్లో అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇల్లు మంజూరుతో పాటు గృహలక్ష్మి పథకం అందేవిధంగా చూస్తామన్నారు. గతంలో మావల పరిధిలోని వార్డులు, మున్సిపాలిటీలో విలీనమైన నేపథ్యంలో లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. అధికారులతో చర్చించి అర్హులను పారదర్శకంగా ఎంపిక చేస్తామన్నారు. సమావేశంలో కౌన్సిలర్ భరత్, నాయకులు గంగారెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

కేంద్ర వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

జైనథ్: కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శుక్రవారం మండలంలోని మేడిగూడలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూంలు పంపిణీ చేస్తామని, సొంత స్థలంలో ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. మండలంలోని గూడ గ్రామంలో నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, సర్పంచ్ లింగారెడ్డి, వేణుయాదవ్, పురుషోత్తం పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని తోయగూడ గట్టుపై కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో సత్యనారాయణగౌడ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడారు. కూలీలు ప్రతిరోజు రూ.270 కూలీ వచ్చేలా పనులు చేయాలన్నారు. ఎండాకాలం కావడంతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. టీఏ ధరంసింగ్ తదితరులు ఉన్నారు.